# ?

ఎస్. బాబు



మిలిటరీలో చేరి పదిహేనేళ్లయిన తరవాత మొట్టమొదటి సారిగా ఉత్తర భారత దేశంనుండి ఆంధ్రకి రావడం ఇదే ప్రథమం రావుకి. తన మాతృభాష తెలుగనీ, తను ఆంధ్రుడనీ గుర్తు వచ్చినప్పుడల్లా రావుకి నవ్వు వస్తుంది. ఇన్నేళ్ల మిలిటరీ జీవితం మంచుశిఖరాలమీద రాత్రింబవళ్లు యుద్ధంలో గడిచిపోతే, మిగతా సగం పేకాడడంలోను, విస్కీ మత్తులోను గడిచిపోయింది. ఇహ తనకి జాతి, కులం, భాష గురించి ఆలోచించడానికి అవకాశం ఎక్కడుందీ?

తను ట్రెయిన్ ఎక్కినప్పటినుంచీ తనని ఇదే బాధ తొలిచివెయ్యడం మొదలుపెట్టింది. మొదట మనస్సులో ఏ మూలో సన్నగా పీకుతున్న వ్యథ తీవ్రంగా ఆలోచించి ఆలోచించినమీదట ఇంకా ఎక్కువై హృదయమంతా ఆవరించుకుంది. మధ్యాహ్నం మూడు గంటలనుండి సాయంత్రం అందమైన సంధ్య చీకట్లలో కరిగిపోయేంతవరకూ కిటికీలోనుంచి బయటకు చూస్తూ, సిగరెట్టుమీద సిగరెట్టు కాలుస్తూ, తీవ్రంగా ఆలోచిస్తూ గడిపాడు, కనీసం ఇతర ప్రయాణికుల ఉనికినైనా గుర్తించకుండా.


సుమారు ఇరవై ఏళ్లక్రితం ప్రపంచంలో నా అనే వాళ్లెవ్వరూ లేని అనామకుడైన రావు ఎండకి ఎండుతూ, వానకి తడుస్తూ, పంపునీళ్లతో కడుపు నింపుకోవడం చేతకాక, గతిలేక పదిహేనేళ్లకే వయస్సు చాలకపోయినా దొంగ సర్టిఫికెట్లతో మిలిటరీలో చేరాడు. ముప్ఫై అయిదేళ్లకల్లా యుద్ధానికి పనికి రానివా డయిపోయాడు. ఇంటికి రావడానికి ఇల్లంటూ ఎక్కడుంది తనకి? చివరికి స్టేషనులోకి పెట్టె, బెడ్డింగులతో వచ్చి ఏ ఊరికి వెళ్లాలనే సందిగ్ధలో కొట్టుకుపోయి, ఈలోగా ఎన్నో ట్రెయిన్లు మిస్ అయి, చివరికి హైద్రాబాద్ ట్రెయి నెక్కాడు. తన ముప్ఫై ఏళ్ల మిలిటరీ జీవితంలో ఏనాడూ ఎదుర్కోని సమస్య ఈ నాడు ఎదుర్కోవలిసి వచ్చింది. తన [illegible]కే ఆశ్చర్యం వేసింది రావుకి [illegible]త్రం బాధపడే ంత సున్నితత్వం ఉందా తన హృదయానికీ అని.

అందుకే తిరిగి ఇన్నాళ్లకు తనకి బావాలనిపిస్తూ ఉంది. ఢిల్లీలో ఉన్నప్పుడు ఎప్పుడయినా అనివార్య కారణాలవల్ల విస్కీచుక్క కరువైనప్పుడుతప్ప ఇలా అనిపించలేదు. ఇహనుంచీ జీవితంలో నూతనాధ్యాయం ప్రారంభమైంది.

అప్పటిలా తనకి మత్తులో మునిగి పోయి జీవితాన్ని మరిచిపోయే శక్తి పోయింది. విస్కీ ఇహ అంత స్వేచ్ఛగా, చవగ్గా దొరకదు తనకి!

తన కెప్పుడూ చావాలనిపిస్తూ ఉంటుందనీ, ఎందుకో చెప్పమనీ అడిగా డొక సైకాలజిస్టుని. లోకంలో ఎవ్వరూ లేని ఒంటరిగాళ్లకు అలానే అనిపిస్తుందనీ, అందుకే పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడమనీ సలహా ఇచ్చాడతడు. "అబ్బే! యుద్ధం, వేట, విస్కీ—ఈ మూడింటికీ అంకితమైపోయిన జీవితంలో పిల్లని వెదుక్కుని పెళ్లి చేసుకోడానికి తీరి కెక్కడుందీ!" అన్నాడు తను. "పోనీ, అలా అనిపించినప్పుడల్లా విస్కీ తాగు" అని మరో సలహా ఇచ్చాడు. "మిలిటరీలో ఉన్నన్నినాళ్లు సరే, అవతల విస్కీ దొరకదు కదా, అప్పుడేం చెయ్యాలి?" అనడిగాడు. ఆయనతో ఓర్పు నశించి, "అయితే, ఇహ చావు వచ్చేంతవరకూ ఎదురుచూస్తూ ఉండు" అన్నాడు.

ఆ మాటలు తన మీద ఎలా పనిచేశాయో ఏమోగానీ, ఆ క్షణం నుంచీ జీవితంలో ఎవర్నీ ప్రేమించడానికి అవకాశం లేని రావుకి, మృత్యువంటే గాఢమైన ప్రేమ జనించింది. ప్రేమే కాదు, ఆ నిరీక్షణలో విరహం కూడా అనుభవించడం నేర్చుకున్నాడు. తనలోని జీవుణ్ణి తనే బలవంతంగా హత్య చెయ్యడం ద్వారా మృత్యువుని చేరవచ్చు కానీ, అది బొత్తిగా రావు ప్రవృత్తికి విరుద్ధమైనది. 'ఇదేమయినా సినిమా, బోరు కొడితే లేచి రావడానికి? జీవితం!' అనుకున్నాడు. అదీగాక బలవంతంగా ప్రాణాలు తీసుకున్నందువల్ల అసలు నిర్దేశించబడిన ఆయువు గడిచేంతవరకు ఆ ఆత్మ అక్కడే కొట్టుకులాడుతుందని ఎక్కడో చదివా డతను. అటువంటప్పుడిహ చచ్చిపోతే ప్రయోజనం ఏమిటి? ఈ రకం వేదాంతాన్ని తనలోని నాస్తికత్వం ఎంత ప్రతిఘటించినా, ఎక్కడో తనకి దేవుడు, దయ్యం, ఆత్మ—వీటివి గురించి భయం లేకపోలేదు తనలో.



చిత్రం—పి. రమణమూర్తి (కడప)

ట్రెయిన్ ఏదో స్టేషనులో ఆగుతూంది. తిరిగి కూత వేసుకుంటూ కదులుతూంది. రావు మనస్సుకి ఏదీ పట్టడమే లేదు. ఇప్పుడే ఒక కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టినట్లు అనుకుంటున్నా డతడు. ఎవ్వరూ లేని అండమాను దీవుల్లో వదిలేస్తే, మనిషి విసుగు పుట్టి ఎలా తల పగులగొట్టుకు చస్తాడో అలా ఉంది అతడి పరిస్థితి. 'జీవితం ఏనాడూ ఇంత బోరు కొట్టలేదు' అనుకున్నాడు, తన ఆలోచనల కన్నింటికీ సారాంశం అదేనన్నట్లు.

బద్ధకంగా ఒళ్లు విరుచుకున్నాడు రావు. పెట్టె అంతా కలయజూశాడు. కొందరు జోగుతుంటే, మరికొందరు పేపరు చదువుకుంటున్నారు. ఎవ్వరూ మాట్లాడుకోవటం లేదు. ఎదురుగా కూర్చున్న ఓ వ్యక్తి వంక చూశాడు తను. అతడి కళ్లు మాట్లాడే వాళ్లకోసం తెగ వెదుకుతున్నాయని గ్రహించాడు రావు. రావుకు అలాటివాళ్లంటే తగని అసహ్యం. ఏదో అస్తమానం వాగుతూ, ఎదటివాళ్లని బోరు కొట్టిస్తూ తప్ప ప్రయాణం చెయ్యలేరు కొందరు. అంతటితో ఊరుకోక ఎదటివారి వివరాలన్నీ లాగందే తృప్తి పడరు. ఈ ఎదుట కూర్చున్నాయనా అంతే. తన పక్కన కూర్చుని ఉన్న ఒక సిక్కుని, "ఎక్కడ నుంచీ, ఎక్కడిదాకా" అని అడిగాడు. ఆయన ముక్తసరిగా చెప్పి ఊరుకున్నాడు. తరవాత పేపరడిగాడు. ఆయన ఏమీ మాట్లాడకుండా ఇచ్చేశాడు. ఇహ ఏదో ఒకటి మాట్లాడటానికి కల్పించుకుంటూ, "ఇవ్వాళ చాలా వేడిగా ఉందికదూ!" అన్నా డతడు, పేపరు చదువుకుంటూ విసుగుకుంటూ. దాని కా వ్యక్తి ఏమీ మాట్లాడకుండా, లేచి ఫాన్ ఆన్ చేశాడు. అంతే, వాళ్లిద్దరి మధ్య ఎటువంటి సంభాషణా జరగలేదు. తనకి నవ్వు వచ్చింది. అతనివైపు చూశాడు. మనిషి వంక చూస్తూనే ఒక్క క్షణం విశ్రాంతి లేకుండా గడగడా వాగే మనిషిలా ఉన్నాడు. సన్నగా, తెల్లగా ఉన్నాడు. ఒళ్లు పాలిపోయిన రంగులో ఉంది. వదులుగా ఉన్న చొక్కాలోంచి పొడుగ్గా, స్పష్టంగా ఎముకలన్నీ కనిపిస్తున్న మెడా, మాట్లాడినప్పుడు అక్కడక్కడా కనిపించే నల్లని పళ్లూ, సన్నగా పైకి ఎగదువ్విన జుట్టూ—అతడివైపునుంచి చూపులు తిప్పుకున్నాడురావు. బయటపరిగెత్తుతున్న చీకటిలో అక్కడక్కడా మెరిసి మాయమౌతున్నాయి నెగళ్లమంటలు. 'అత నిలా సన్నగా పీలగా ఉంటే చావు తొందరగా వస్తుందేమో' అనుకున్నాడు రావు. తన శరీరంవంక చూచుకున్నాడు. లావుగా భారీగా బలిసి, మిలిటరీలో కరకుదేరిన శరీరం! నిలువెత్తు విగ్రహం! ఏదో గాయంవల్ల కుళ్లిపోతుంటే కుడికాలి మూడు వేళ్లు తీసేశారు తనకి. మరే లోపమూ లేని విగ్రహం తనది. 'రాయి వంటి శరీరం. ఏ జబ్బూ రాదు.' తిట్టుకుంటూ చెంపలు నిమురుకున్నాడు రావు. గరుగ్గా తగిలాయి. అక్కడి మంగలి అంటుండేవాడు క్షవరం చేస్తున్నప్పుడు, "నా కత్తి సాన పెట్టడానికి ఏ ఆకురాయీ పనికిరాదు, సాబ్, మీ చెంపల ముందు" అని.

ఏదో స్టేషన్‌లో రైలు ఆగింది. సిగరెట్లయిపోయాయి. తిరిగి కొన్నాడు రావు. ప్లాట్‌ఫారమ్‌మీద ఎక్కే దిగేవాళ్ల హడావిడీ, అమ్ముకునేవాళ్ల అరుపులూ నిండుకున్నాయి. అందర్నీ చూస్తూ కూర్చున్నాడు రావు. ఎవరో ఒక ఆసామీకీ, కూలీకీ ఘర్షణ జరుగుతూంది పైసల దగ్గిర. "ఎలా ఇవ్వవో చూస్తాను" అంటున్నాడు కూలీ. "అంతే ఇచ్చేది. పోయి ఎవడితో చెప్పుకుంటావో చెప్పుకో" అంటున్నా డాయన. 'ఛ! అందరికీ ఎంత తాపత్రయం, ఆదుర్దా—ఈ వెధవ జీవితంమీద! కాట్లకుక్కల్లే పోట్లాడుకుంటారేం ఈ వెధవ బ్రతుకు బ్రతకడానికి?' అనుకున్నాడు రావు.

ట్రెయిన్ నెమ్మదిగా కదిలింది.

ఎక్కడో, ఏదో పుస్తకంలో చదివాడు రావు, కొన్ని వేల సంవత్సరాలకి భూమంతా బాంబులా పేలిపోతుందని! 'అదేదో ఇప్పుడే జరిగితే బాగుణ్ణు!' అనుకున్నాడు రావు. ఎంత కసి తనకీ వెధవ ప్రపంచమంటే! ఒక్కసారి విశ్వాన్నంతా ఆక్రమించేటట్లు పెరిగిపోయి ఆ భూప్రపంచాన్నంతా ఫుట్‌బాల్‌లా తన్నేసేయాలన్నంత కసి!

ఆలోచనలు మాని ఇటువైపు తిరిగాడు రావు. ఆశ్చర్యం! ఎదురుగా కూర్చున్నతను ఓ తెలుగు నవల పేజీలు తిప్పుతూ కూర్చున్నాడు. 'చచ్చాం! తెలుగువాడన్న మాట! పలకరించకుండా జాగ్రత్త పడాలి!' అనుకున్నాడు రావు. ఇలాంటి మనుషులంటే తగని చిరాకు తనకి. అదీగాక తెలుగు చక్కగా మాట్లాడ్డానికి

చాలా అవస్థలు పడాలి. పదిహేనేళ్లయింది కదా మరి!

రావు ఇలా ఆలోచిస్తూండగానే, ఆ వ్యక్తి రావుని పలకరించడానికే అంతసేపటి నించి ఎదురుచూస్తున్నవాడిలా పలకరించాడు, "ఎందాకా... ఎక్కడనుంచి?" అని. జవాబు చెప్పక తప్పింది కాదు రావుకి. చెప్పాడు ముక్తసరిగా, "హైద్రాబాదు, ఢిల్లీ" అని.

"మీరు ఆంధ్రులా?" ఎక్కడలేని కుతూహలం నిండిఉంది, అతడి కంఠంలోనూ, కళ్లలోనూ.

రావుకి ఎటూ పాలుపోలేదు. తను ఆంధ్రావాడు కాదు. ఏదో పనిమీద హైద్రాబాదు వెడుతున్నాను, అని చెప్పచ్చు ఈ మనిషిని వదిలించుకోడానికి. లేదా, బంకలా పట్టుకొంటాడు తనని. ఆ వాగుడు స్వభావాల మనుషులు తనకి బాగా తెలుసు. తను హైదరాబాదు చేరేదాకా తలనొప్పి తప్పదు.

కానీ ఎందుకో, 'నేను ఆంధ్రుణ్ణి కాను' అని చెప్పేందుకు ఎంతో తటపటాయించాడు రావు. ఎంత చెప్పాలని ప్రయత్నించినా ఆ మాటలు బయటికి రావడానికే మొరాయించినాయి. చేసేదిలేక తల ఊపాడు అవునని.

అంతే. అతడి మొహం విచ్చుకుంది, ఎక్కడలేని సంతోషంతో. ఆంగ్లం వదిలేసి స్వచ్ఛమైన తెలుగులో ఆరంభించాడు. "అబ్బ. చెప్పరేమండీ, భలేవారే! మాట్లాడే వాళ్లెవ్వళ్లూ లేక, కాలక్షేపం కోసం ఇందాకటినించీ చచ్చిపోతున్నానంటే నమ్మండి." అతడి కళ్లలో మెరుస్తున్న ఉత్సాహాన్ని చూచి, అతడు మాట్లాడుతూంటే వింటే చాలా బాగుంది. తను ఏమీ మాట్లాడలేదు. అతడే చెప్పాడు: "పూనానించి రావడం. గుంటకల్‌దాకా వెళ్లి, అక్కడినుంచి రేణిగుంటమీదుగా వెళతా నన్న మాట!" అంతటితో ఆగలే దతడు. "ఈ దూర ప్రయాణా లున్నాయి చూశారూ, తిండీ, నీరూ అన్నిటికీ అవస్థలు పడవలిసిందే. ఇహ గంటల తరబడి, రోజుల తరబడి రైళ్లలోనే గడపాలి. అంతకుమించి తలనొప్పి ఉండదు. ఇహ నిద్ర సంగతి సరేసరి! ఎలాగో స్లీపర్ బుక్ చేసుకోవడంవల్ల బ్రతికిపోయాంగానీ, ఈ వేసవి రోజుల్లో ఎంత అవస్థ చూడండీ! ఇవన్నీ చూచుకుంటే 'ఎందుకొచ్చిన ప్రయాణం, బాబూ!' అనిపిస్తుంది. ఏమంటారు?"

రావుకి చిరాకెత్తిపోతూంది ఆ మాటలకి. అతణ్ణి వదిలించుకోడానికి తన అయిష్టాన్ని సాధ్యమైనంత బాగా ప్రదర్శిస్తున్నాడు — ఎటో చూస్తూ, నిర్లక్ష్యంగా పొగ వదులుతూ.

"నేను ఎమ్. ఎస్‌సి. పూనాలో ఆలిండియా ఫుడ్ టెక్నాలజీలో ఉద్యోగం. 600 రూపాయలు డ్రా. మీరు?" తనణ్ణి గురించి అతడే పరిచయం చేసుకున్నాడు.

రావు సిగరెట్టు అవతల పారేసి ఇటు తిరిగాడు. అతడి డిగ్రీని చూసి కొంచెం ఆశ్చర్యపోయాడు. నెమ్మదిగా జవాబిచ్చాడు, "నేనూ అంతే. ఆర్మీలో ఉంటున్నాను" అని. అతడి డిగ్రీ చూడాక కొంచెం గౌరవం ఏర్పడింది అతని పైన. 'అతడికి పాతికపైన రెండు మూడు సంవత్సరాలకంటే ఎక్కువ ఉండవు. మరి ఆవతారం ఏమిటి అలా ఉన్నాడు—వెలిసిపోయిన చొక్కాలా, దారాలు వచ్చే లూజు పాంటులా? పైగా ఎమ్. ఎస్‌సి. కూడా' అనుకున్నాడు రావు.

"ఏం ఉద్యోగాలోనండీ, ప్రాణం పోతూంది. ఇహ గతిలేక పొట్ట చేత్తో పట్టుకుని ఇంతదూరం వచ్చామనే కానీ, మనస్సుకు శాంతి అంటూ ఎలా ఉంటుంది చెప్పండి? మనం ఉన్న ఊళ్లో వంద రూపాయల ఉద్యోగం వచ్చినా పరమ తృప్తి నాకు."

రావు ఏమీ మాట్లాడ లేదు. అతడు మాత్రం ఏదేదో మాట్లాడేస్తున్నాడు.

"ఏమిటండీ! అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారూ?"

తిరిగి ఈ లోకంలోకి వచ్చాడు రావు, 'ఎంత స్వచ్ఛమైన తెలుగు!' అనుకుంటూ. మెళ్లో జంధ్యం కూడా అగపడుతూంది. స్వచ్ఛమైన బ్రాహ్మడిలా ఉన్నాడు. "ఏమీ లేదు. ఎంత అభిమానమో మీకు స్వంత ప్రదేశమంటే అనుకుంటున్నాను" అన్నాడు ఏదో ఒకటి మాట్లాడాలని.

"భలేవారండీ. ఎవరి కుండదు? మనిషన్న తరవాత ప్రతివాడికీ ఆ మమకారం సహజం. అందుకే అన్నారు చూడండీ, 'నాదు జన్మభూమికన్న నాక మెక్కడుంది, సురలోక మెక్కడుంది' అని."

'ఆహా — పచ్చి తెనుగు సినిమా డైలాగులు! పైగా బోడి కొటేషన్లు! ఇలా సినిమాల్లోలా, నవల్లో లాగా అసహజంగా మాట్లాడేవాళ్లంటే తగని అసహ్యం. వాళ్లేదో తమ మాటల ద్వారా ఏదో ప్రత్యేకత ఒలకబోసుకోవాలనుకుంటారు? అది పదిమందిలో ఎబ్బెట్టుగా అగపడుతుందని వాళ్లకు తెలియదు' అనుకున్నాడు రావు, సిగరెట్టు వెలిగిస్తూ. అతని కొకటి అందివ్వబోయాడు, "కావాలా?" అని.

"క్షమించండి. అలవాటు లేదు."

'సందేహం లేదు. ఇది అచ్చం అమ్మమ్మ అవతారమే. ఏది ఏమయినా తన కిలాటి మనుషులతో మూవ్ కావడం చేతకాదు. మొరటుదేరిన తన మనస్సు ఏ విధమైన మన్మథత్వాన్నీ భరించలేదు' అనుకున్నాడు రావు.

తను వాచీ చూసుకున్నాడు. ఏడిమిది కావస్తోంది.

"బెంగుళూరు ఎన్నింటికి చేరుకుంటామండీ" అడిగా డతడు.

"షెడ్యూల్డ్ టైమ్ ఏడిమి దనుకోండి. ఖాళీ చేసేటప్పటికి ఏడిమిదిన్నర దాటచ్చు" అన్నాడు రావు. "భోజనం అవీ కానిచ్చే వెళ్లచ్చులెండి. బెంగుళూరు నుంచి తిరిగి తొమ్మిదీపది హేమకు బయలుదేరుతుంది" అన్నాడు.


"లేదు లెండి. నేను భోజనం చెయ్యను. ఏవో పళ్లు తింటే గడిచిపోతుంది."

"ఎందుకని?"

"స్నానం, సంధ్య లేకుండా అన్నం ముందు కూర్చోవడం నా కలవాటు లేదు. నిన్న బయలుదేరేటప్పుడు చేశానంతే. అదీగాక ఎంత ఫస్టు క్లాసు దయినా నా కిక్కడి భోజనం పడదు" అన్నా డతడు.

"ఫరవాలేదండీ. ఈ కాలంలో మీలాగా అన్ని ఆచారాలి పాటించేవాళ్లు చాలా తక్కువ. అదీ ఇంత చదువుకున్న వాళ్లలోకూడా."

"అబ్బే. అలా అనకండి. ఇందులో నిష్ఠగా ఆచరిస్తున్న నియమం అంటూ ఏమీ లేదు. చిన్నతనమంటే పెరిగిన తీరూ, అనుసరిస్తున్న పద్ధతులూ— అంతే! ఒక విధమైన పద్ధతి అలవాటు



చిత్రం—ఆర్. ఎస్. వి. సుందర్ (హైదరాబాద్-20)

లోకంలో ఎవ్వరూ లేని వాళ్ళకు ఎప్పుడూ చావాలనిపిస్తూ ఉంటుంది. అందుకే పెళ్ళి చేసుకుని స్థిరపడమని సలహా ఇచ్చాడు ఒక మనస్తత్వవేత్త. "అబ్బే! యుద్ధం, వేట, విస్కీ — ఈ మూడింటికీ అంకితమైపోయిన జీవితంలో పిల్లని వెదుక్కుని పెళ్ళిచేసుకోవడానికి తీరిక ఎక్కడుందీ?" అన్నాడతను. "పోనీ, అలా అనిపించినప్పుడల్లా విస్కీ తాగు" అన్నాడా వేత్త. మిలిటరీలో ఉన్నన్నాళ్ళూ సరే. ఆ తరవాత విస్కీ దొరకదు కదా? అప్పుడేం చేయాలి?

వడి రావిమంచి వేరుకాలేము సుమండీ. అలా అనుకుంటే భోజనానికి ముందు కాళ్ళూ, చేతులూ కడుక్కోవడమూ ఓ ఆచారమే అవుతుంది. కేవలం తరతరాల మంచి వస్తున్న తీరు—ఇంతకీ చెప్పొచ్చే దేమంటే. . ."

రావుకి చాలా చిరాకు పుట్టుకు వస్తోంది. తీగ కదిలిస్తే డొంకంతా కదిలించినట్టుగా ఉంది ఈయనతో మాట్లాడడం. వెధవ కబుర్లు—బామ్మలా! చిన్నప్పటి బామ్మ గుర్తుకు వచ్చింది రావుకి. చిన్నప్పుడు తన పోకిరీ తిరుగుళ్ళని చూసి ఒకటే శాపనార్థాలు పెడుతుండేది విశ్రాంతి లేకుండా. అరవడానికి ఓపిక లేనప్పుడు మెల్లగా ఇలా నీతులు నూరి పోస్తుండేది. "ఆ అవధాన్లగారి రబ్బాయిని చూసి నేర్చుకో! వాడికి నోటికి రాని పాఠం, పద్యమంటూ లేదు. సాయంత్రం అవగానే లాంతరు వెలిగించుకు కూర్చుంటాడు అరుగుమీద. అలాటి పిల్లల్ని చూస్తే ఎవరికి ముచ్చట వెయ్యదు? నువ్వు దున్నపోతులా ఎదిగావు. వడుగూ అయింది. ఏం లాభం? చూస్తూ ఉండు. నువ్వు బస్సులు తుడుచుకుంటూ, బస్సు లంబడే పడిపోతావు. దొంగవెధవా!"

ఆవిడికి కోపం వస్తే "బస్సు క్లీనరు వౌతావు చూడు. నువ్వు బ్రాహ్మణ కులంలో పుట్టవలసిన వెధవ్వి కాదు" అని తిట్టేది. రావుకి నవ్వు వచ్చేది. అదో తిట్టు ఆవిడికి. అయితే మాత్రం అదో జీవనోపాధి కాదూ— వెర్రిగానీ, అలా పోకిరీగా తిరగబట్టే కాదూ మిలిటరీ ఆఫీసరయింది తను? ఆవిడ మాటలు విని, అవధాన్లగారబ్బాయిని ఆదర్శంగా పెట్టుకుని ఉంటే— ఆ పల్లెటూళ్లోనే పౌరోహిత్యాలు చేసుకుంటూ, కర్మలకీ, శ్రాద్ధాలకీ మొహం వాచి, కార్తీక పిండం కోసం కావుకావుమనే కాకిలా తిరుగుతుండే వాడు.

బెంగుళూరు స్టేషను వచ్చింది. రావు దిగి రెస్టారెంటుకు వెళ్లాడు. భోజనం సయించలేదు. కాఫీమాత్రం తాగి తిరిగి పెట్టెలోనికి వచ్చాడు. అతడు బెడ్డింగు విప్పి పక్క వేసుకుంటున్నాడు.

"అదేమిటీ, అప్పుడే వచ్చారు. భోజనం చెయ్యలేదా?" అనడిగా డతడు.

అలా అన్నప్పుడు ఎందుకో రావుకు చాలా బావుంది. 'ఇంకోసారి అలా అంటే బాగుంటుంది' అనుకున్నాడు.

చెప్పాడు సయించలేదని.

"భలేవారేనండీ. ఎంత రుచించక పోయినా వేళకి ఏదో తినాలండీ. లేకపోతే వేడి చేస్తుంది."

తనకి అమృతపు జల్లులా అనిపించాయి ఆ మాటలు. తనకి నవ్వుకూడా వచ్చింది. తాను డ్యూటీలో ఉన్న కొన్ని రాత్రులు, పచ్చి బంగాళాదుంపలు తినవలసి వచ్చేది. అవికూడా దొరక్క ఆకలిని చంపుకున్న రాత్రు లెన్నో! అలా ఈ రావుకి వేడి చెయ్యదు. చేస్తే ఏనాడో హాయిగా చచ్చి పోయుండేవాడు అనుకున్నాడు.

"మీరుకూడా అస లేమీ తినలేదు కదా! మీకు మాత్రం వేడి చెయ్య దేమిటి?" రాను రాను ఎంతో ఆత్మీయత కురుస్తోంది. తన మాటలు తనకే విచిత్ర మనిపిస్తున్నాయి రావుకి. ఏ నాడూ ఎవరితో ఇంత బాగా మాట్లాడి నట్లు గుర్తులేదు తనకి.

"సరే. నా విషయం చెప్పండి. తింటే ఆయాసం, తినకుంటే నీరసం. అయినా మీ రలా వెళ్లగానే ఓ అరడజను చక్కెరకేళీలూ, రెండు యాపిళ్లూ అర్పితమై పోయాయి ఈ ఆత్మారాముడికి" అన్నాడు నవ్వుతూ.

"ఏమీ తినకుండా ఎలా ఉండగలరండీ ఎంత మిలిటరీవా ళ్లయినా? ఏమన్నా తేలిగ్గా టిఫినైనా చెయ్యచ్చు గదా!" ఆవలిస్తూ అస్పష్టంగా అన్నాడు మళ్లీ.

చల్లటి గాలి వీచింది కిటికీలోనుంచి. చల్లగా వర్షాకాల మేఘం తనని తాకిన ట్లయింది రావుకి.

రైలు కదిలింది. తనుకూడా బెడ్డింగు విప్పి పక్క వేశాడు. నిద్ర మాత్రం రావడం లేదు. కూర్చొని మళ్లీ ఆలోచించసాగాడు రావు.

"ఏమిటండీ, మళ్లీ ఆలోచనల్లో పడ్డారూ? ఇంతకీ హిమాలయాల్లో మీరు యుద్ధం చేస్తుండేవాళ్లా, లేక తపస్సా?" నవ్వా డతడు.

రావుకికూడా చిన్నగా నవ్వు వచ్చింది. 'అతడు అమాయికతని అనుకరిస్తున్నాడో, లేక అదే అతని స్వభావమో తెలీదు కానీ, అతడి సంభాషణ గులకరాళ్లమీద ప్రవహించే తేటనీరులా ఉంది' అనుకున్నాడు.

అతడు నిద్రపోవడాని కుపక్రమించాడు. చొక్కా విప్పి పైన తగిలించాడు. స్వెట్టరు తొడుక్కున్నాడు. మఫ్లరు చుట్టుకున్నాడు. ఇష్టదైవాన్ని కాబోలు కళ్లు మూసుకుని కాసేపు ధ్యానించి పడుకున్నాడు. "వెధవది. పగలంతా ఉడికి పోవడమూ, రాత్రయితే రక్తమంతా గడ్డకట్టుకు పోయేట్టు చలిగాలీ. కాస్త ఆ కిటికీ వెయ్యండి, మీకు పుణ్యం ఉంటుంది" అన్నా డతడు.

రావు మౌనంగా కిటికీ వేశాడు.

అతడే మళ్లీ ప్రారంభించాడు:

"ఎలాగో ఈ స్లీపరు బుక్ చేసుకోవడం వల్ల బతికిపోయాను గానీ, లేకుంటే చచ్చిపోయేవాణ్ణే నిజంగా. ఒక్క గంట ఆలస్యంగా పడుకుంటే తెల్లారి మంచం మీదనుంచి లేవలేను నేను." వెచ్చగా దుప్పటి కప్పుకుంటూ అన్నా డతడు.

"ఏమౌతుం దేమిటీ?" అన్నాడు రావు.

"ఏముందీ, టెంపరేచరు ఎక్కి పోతుంది. లేదా ఒంటికణత నొప్పి అంటారు చూశారూ, అది వచ్చేస్తుంది. ఇహ యమయాతనే అనుకోండి నయ మయ్యే వరకూ.


"అందుకే చూశారూ ఈ తిండి, నిద్ర—ఈ విషయాల్లో మాత్రం అమిత జాగ్రత్త నాది. ఏ కాస్త జల్లులో తడిసినా, కాస్త ఎండపూట బజార్లో తిరిగినా — ఇహ ఏమాత్రం అజాగ్రత్త జరిగినా, ఇహ మళ్లీ మందులూ, టానిక్కులూ, ఇంజక్షన్లూ..."

రావుకి చిర్రెత్తిపోతూంది. 'వెధవ సోదె. ఇంకో కంపార్టుమెంటులోకైనా మారిపోవాలి' అనుకున్నాడు. ఈయనకి ముప్ఫై ఏళ్లకే వందేళ్లు నిండిపోయిన ట్లున్నాయి. ఎంత బలహీనమైనా, ఇలా నీరసంగా మాట్లాడే యువకుల్ని చూళ్లేదు తను.

"ఎందుకోనండీ బలం, దారుఢ్యం అనేవి చూశారూ, అవి పుట్టుకనుండే, హెరిడిటీనుండే రావాలండీ. మనం ఎన్ని మందులు వాడినా మన శరీరతత్వం మాత్రం మారదు. కొందరు చూశారూ డొక్క మాడుతున్నా, దున్నపోతుల్లా ఉంటారు. నాలాటివాళ్లు ఎన్ని టానిక్కులు తాగి, ఎన్ని యాపిల్సు తిన్నా ఇంతే. జన్మతః ఉన్న అనారోగ్యం చూడండీ, ఎలా పోతుంది? ఏదో మన తృప్తి కోసమంటూగానీ, ఈ మందులూ మాకులూ. లేకపోతే. . ."

రావు అసహనానికి అడ్డు లేకపోయింది. 'ఉత్త గ్రామ్‌ఫోన్ రికార్డులా వాగుతాడేం.' "అయితే, మీలాంటి వాళ్ల దగ్గర తప్పకుండా ఉంటాయన్న మాట మాత్తర్లు. ఒహ సారిడన్ మాత్తరుంటే ఇలా ఇస్తారూ?" వీలయినంత అక్కసుగా అన్నాడు రావు, అతడి ధోరణినే అనుకరిస్తూ. అతడికి తన బామ్మ గుర్తుకు వస్తూండి, ఆ మాటలు వింటూంటే. ఆవిడా అంతే. తెల్లవారుఝామున లేచి, మడి గట్టుకుని నీళ్లు తెస్తూ, ఇలాగే గొణుగుతూ ఉండేది తనని నిద్ర పోనియ్యకుండా. "ఏదో ఈ ఘటం బతికిఉందంటే వీడికోసమేనమ్మా. లేకపోతే ఈ ప్రాణాలమీద ఎవడి కేడ్చిందీ మమకారం? వాడు పెరిగి పెద్దవాడయ్యే వరకూ ఈ ఘటం ఇలాగే ఉంటుంది కదలకుండా" అంటూండేది తన్నుద్ధరించటానికే ఆవిడ బతికి ఉన్నట్టు. ఏం ఉద్ధరించిందీ తనని? లేకపోతే తనకి ఆ దిక్కుకూడా పోయింది. అంతే!

"ఏమిటీ కావా లన్నారూ? సారిడన్ మాత్రా? ఓ దానికేం భాగ్యం. ఇస్తా, ఉండండి. నే నెటూ జామాయిలా కోసం లేద్దామనే అనుకుంటున్నా" అని లేచి, బాగులోంచి టాబ్‌లెట్ తీసి ఇచ్చాడు. "ఇది సారిడన్ కాదు, నవాల్జిన్. తలనొప్పే కాదు, నడుం నొప్పీ, గొంతు నొప్పీ, దవడ నొప్పీ — అన్నీ తగ్గిపోతాయి బాగా! నే నదే వాడతాను"




చిత్రం—ఆర్. ఎస్. వి. సుందర్ (హైదరాబాద్-20)

అన్నాడు.

రావు మౌనంగా నవ్వుకుంటూ అందుకున్నాడు. అంత స్పష్టమైన వ్యంగ్యాన్నికూడా అర్థం చేసుకోలేని అతణ్ణి చూస్తే పాపం! అనిపించింది రావుకి. ఇందాకా చొక్కా విప్పినప్పుడు చూచాడు. అతి దుర్బలమైన శరీరం. 'వాగడం తప్ప ఇంకేం తెలియదు. మంచి మనిషి!' అనిపించింది రావుకి. 'అయినా, జీవితంలో అనుభవించే దశ యౌవనమే కదా. అదే ముసలివనమై కూర్చుంటే, ఇహ జీవితంలో ఏం అనుభవించినట్టూ?' అని జాలిపడ్డాడు. అతడి మనసు వెక్కిరించింది తనని. 'అన్నీ ఉండి తన యౌవనంలో తా నేం అనుభవించాడనీ, ఒకళ్లని జాలి తలచడానికి? మరి తనూ మనిషేగా?' నవ్వుకున్నాడు రావు. ఈమధ్య తనకి మతి బొత్తిగా పోతూంది. 'తాగినప్పుడే నయం...తెలివిగా ఉంటున్నాను' అనుకున్నాడు.

అతడు జామాయిలు ముక్కుకీ, కణతలకీ రాసుకుంటూ అంటున్నాడు: "మాటిమాటికీ కొనుక్కోవడం ఎందుకని ఒకసారే తెచ్చిపెట్టుకునేవాణ్ణి చాలా టాబ్‌లెట్లు. అది చూసి మా స్నేహితు డొకడు పరిహాసం చేసేవాడు—నవాల్జిన్ ఏజెన్సీ చేపట్టావా అని."

రావు ఆ విట్టుకి నవ్వలేదు. వెల్లకిలా పడుకుని, రైలు కుదుపులకి ఊగుతూ ఆలోచిస్తున్నాడు ఏదో. అతడు రాసుకుంటున్న జామాయిలు వాసన గుప్పుమని కొడుతూ కడుపులో తిప్పినట్లుం దతనికి. "కాసేపు చల్లగాలికే చూశారా, ముక్కు గాలి పీల్చుకోనీకుండా ఎలా మూసుకు పోయిందో..." అంటున్నా డతడు పైగా.

"అస లంత వీక్‌నెస్ ఎలా కలిగింది మీకు? జబ్బేమయినా చేసిందా?" అనడిగాడు.

"జబ్బా? నాకు చెయ్యని జబ్బంటూ ఎక్కడుందండీ? అసలు నేను పుట్టుకనుంచే జబ్బుమనిషిని! ఎంతోమంది పిల్లలు బతక్కుండా చచ్చిపోగా, ఏవో వ్రతాలూ, తాయెత్తులూ—వీటివల్ల నేను బ్రతికానట. అదీగాక జన్మారంభంనుంచీ అనారోగ్యమే. నా తరవాత ఏడుగురూ—తమ్ముళ్ళూ, చెల్లాయిలూ బతికారు. అంతేకాక, వాళ్ళు నాలాకాక చాలా ఆరోగ్యంగాకూడా ఉన్నారు. అదేమిటో నా ప్రారబ్ధం. అదీకాక పదిహేనవ ఏట భయంకరమైన టైఫాయిడ్ వచ్చింది నాకు. అప్పుడు బతకడం అసంభవం అనుకున్నారట. కానీ బతికాను. బతికున్నాను ఇంకా" అన్నా డతడు.

రావు ఏమీ మాట్లాడటం లేదు.

"ఏమోనండి ఈ వెధవ జీవితం! క్షణం క్షణం ఒహటే భయం, ఎప్పుడేదీ తిరగబెడుతుందో అని. అందుకే మా అమ్మ నా గురించి దిగులు చెందని దినం అంటూ ఉండదు. అలా అని నాకు చావంటే చాలా భయం అనీ, పిరికివాణ్ణనీ అనుకునేరు! నేను చచ్చిపోయి హాయిగా ఉండా లనుకుంటే, కత్తిమీద సాములా ఎమ్. ఎస్‌సి. వరకూ ఎందుకు చదవడం? నా జీవితంమీద నా చెల్లెళ్ల పెళ్ళిళ్ళూ, తమ్ముళ్ల చదువులూ, ముసలి తల్లి తండ్రులూ— ఎందరి బాధ్యతలూ, భవిష్యత్తులూ అల్లుకుని ఉన్నాయంటారు? ఇహ నేను చచ్చిపోతే మా కుటుంబమంతా వీధిన పడ్డట్టే కదూ—అందుకే నాకు చావంటే అంత భయం.

"నా స్నేహితు లెప్పుడూ నన్నేడిపిస్తూ ఉంటారు ఈ విషయంమీద. వాళ్లకేం తెలుసూ నా జీవితం విలువ!"

రావుకి ఆశ్చర్యం వేస్తూంది. అతను కావాలని ఈ పెట్టెలో ఎక్కడా ఏమిటీ, బొత్తిగా తనకి విరుద్ధంగా!

"ఈ గొడవల కేంగానీ, ఏమయినా విశేషాలు చెప్పండి. మళ్లీ యుద్ధం ఎప్పుడు వస్తుందిట?" ఏదో అడుగుతున్నా డతడు.

రావు ఏమీ మాట్లాడలేదు. కిందికి చూడ నారంభించాడు. ఏదో వంతెన మీదనుంచి పోతున్నట్టుంది రైలు. ఎక్కడో అగాధాలలోంచి అక్కడక్కడ రైలు వెలుతురు పడి మెరుస్తూ అగపడుతున్నాయి టెలిగ్రాఫ్ తీగలు. చాలా సేపటి వరకూ అలాగే చూస్తూ ఉండిపోయాడు రావు. దూకేద్దామా అనిపించింది రావుకి. కానీ తనతోపాటు అతనున్నాడే—ఎలా? తను దూకడం చూచి భయపడి, గుండె అయినా ఆగిపోగలదు అతడికి. నిద్రపోయిన ట్టున్నాడు.

"ఏమండీ, ఇంకా పడుకోలేదా?" అంటున్నా డతడు. రావు ఆలోచనలనుంచి తేరుకున్నాడు. "నిద్ర రావడం లేదండీ, ఎందుకో" అన్నాడు.

"అవునండీ. నిద్ర రావడం లేదు నాక్కూడా. ప్రయాణం చేస్తూ ఉన్నప్పుడు మనస్సంతా చేరుకునే గమ్యస్థానంమీదే ఉంటుందండీ. నిద్రెలా పడుతుంది? యాభై రూపాయలు పోసి కొన్న పొన్నుకర్రని చూచి నాన్నగారు ఎంత ఆనందిస్తారో? ఫ్లవర్ వాజులూ, వానిటీ బాగులు, బొమ్మలు, చీరెలూ, ఫౌంటెన్ పెన్నులూ—ఒకటేమిటి—అందరికీ ఏదో ఒకటి పట్టుకు పోవలసిందేనండీ. చివరికి మా పనిమనిషి అప్పాలమ్మకి కూడా. . ."

రావుకి ఏంత ఇష్టం లేకపోయినా ఆ మాటలు బలవంతంగా చెవుల్లో దూరి ఘోష పెడుతున్నాయి. రాయిలా కూర్చున్నా డతడు బయటికి చూస్తూ.

"ఇహ చూడండీ, నిమ్మకాయ, కుంకుళ్ళు, సీకాయలతో మా అమ్మ తలంటి పోసేసరికి ఈ మూడేళ్ల దరిద్ర మంతా వదిలిపోతుంది. . ."

అతడు రావుతో మాట్లాడ్డం లేదు. వెల్లకిలా పడుకుని పైకి చూస్తూ మాట్లాడుతున్నాడు. మనసులోని మాటల్ని మరీ స్వగతంలా చెప్పుకోకుండా రావుని ఉపయోగించుకుంటున్నాడు.

"నేను రెండేళ్లయింది మా ఊరినించి వచ్చి. మళ్లీ ఈ దీపావళికి రావడం. పోయినసారి దీపావళికి రానందుకు ఎంతో విచారించారు మా వాళ్లంతా. పండగ మూడు రోజులూ అమ్మ నన్ను తలుచుకుంటూనే ఉందిట, అక్క డేం అంటున్నాడోనని.


"ఇహ మా వాడు సురేష్ ఉన్నాడు చూశారూ, అంటే మా ఆఖరి తమ్ముడు లెండి! నేను వచ్చేటప్పుడు వాడికి సరిగ్గా మాటలే రావు. మొన్ననే రెండవ తరగతిలో వేశారట. అప్పుడే ఎంత ముద్దుగా ఉత్తరం రాశా డనుకున్నారూ — వంకరటింకర అక్షరాలతో, 'అన్నయ్యా? ఎప్పుడొస్తావు—ఏమేమి తెస్తావు' అనీ..."

చిన్నప్పటి ఓ సంఘటన గుర్తుకు వచ్చింది రావుకి. ఎవరో తన తోటి పిల్లవాడు ఏదో తింటూ, తనని ఏడిపించడానికి తనకి బాగా దగ్గిరిగా వచ్చి ఊరిస్తూ, పిటకరిస్తూ వెక్కిరించడం ఆరంభించాడు తనకి పెట్టకపోగా. తనకి బాగా ఒళ్ళు మండిపోయి, మీద పడి చితకకొట్టాడు. తరవాత అతడు వాళ్ల అమ్మా నాన్నలకి చెప్పి తనని తన్నించాడు. తన అమ్మకూడా బాగా తిట్టింది తనని.

ఆ సంఘటన ఎందుకు గుర్తుకు వచ్చిందో తలుచుకుంటే నవ్వు వచ్చింది రావుకి.

"ఏమిటండీ నవ్వుతున్నారూ, నా ధోరణి చూసేనా? ఏం చెయ్యడమండీ, చిన్నప్పటినుంచీ చాలా అలవాటయింది ఇలా వాగడం. ఎవరూ లేకపోయినా సరే, గోడలతోనైనా మాట్లాడుతూ ఉంటాను. అందుకే అంతా నన్ను తిట్టే వాళ్ళు—అధికప్రసంగి అని."

తను చాలా రైలు ప్రయాణాలుల్ని చూశాడు గానీ, మరీ ఇలా స్వంత విషయాలూ, వ్యక్తిగత అభిప్రాయాలూ ఇలా వెళ్లడించుకుపోవడాన్ని ఎక్కడా చూడ్లేదు రావు. 'ఇదీ బాధకునే మనిషి కాదు. కొత్త, పాత లేకుండా మాట్లాడే మనిషి' అనుకున్నాడు. 'కొందరికి ఎంత చదువు చదివినా, వయస్సులో ఎంత పెరిగినా స్వభావంలో




చిత్రం—ఆర్. ఎస్. వి. సుందర్ (హైదరాబాదు-20)



దీర్ఘ నిద్ర  ఫోటో—ఆర్. వి. షిండే (కొల్హాపూర్-2)

ఏ మార్పూ రాదు' అనిపించింది.

"రేపు ఈపేళ్టికి మా ఇంట్లో పడుకుని కబుర్లు చెబుతూ ఉంటాను. మా నాన్న 'ఇక పడుకో, చాలా రాత్రయింది. రాత్రంతా నిద్ర లేదుగామాలు రైల్లో' అంటుంటారు. 'అంత దూరాభార ప్రయాణం ఎక్కడన్నా దగ్గిర ఊళ్లలో పనికోసం ప్రయత్నించరా అంటే వినవు' అంటూ మొదలెడుతుంది మా అమ్మ..." అతడు కలలోలాగా మాట్లాడుతున్నాడు. తరవాత ఉన్నట్టుండి అన్నాడు: "ఇంతకీ మీ పేరేమిటండీ?"

చెప్పాడు.

"నాకు రైళ్లలో బోలెడుమంది స్నేహితులౌతుంటారు. కానీ ఎవళ్లకీ ఉత్తరాలు రాయను. అయినా మీ జ్ఞాపకార్థం మీ అడ్రసూ ఇవ్వండి. ఉత్తరాలు రాయడానికి బద్ధకమైనా అడ్రసులు తీసుకోడంలో చాలా రెగులర్ నేను."

తన అడ్రసు ఇచ్చి అతని అడ్రసు తీసుకున్నాడు రావు. నవ్వుకుంటూ అత నిచ్చిన కాగితం వంక చూశాడు.

ఎస్. రంగనాథాచారి, ఎమ్. ఎస్‌సి., సి. ఎఫ్. టి. ఆర్. ఐ., పూనా—6.

అంతే. వాళ్లిద్దరూ విడిపోయారు. తెల్లవారాక ఆ బండి గుంటకల్ చేరింది. అతను రేణిగుంట, రావు హైదరాబాదు—చీలిపోయాయి దారులు.

రావుకి దాదాపు పిచ్చి పట్టినట్టుగా ఉంది.

మరునాడు ఒక రోజు ఆలస్యంగా హైదరాబాదు చేరా డతడు, సమ్మెవల్ల రైళ్లాగిపోయిన కారణంగా.

చాలా మంది తిడుతున్నారు సమ్మె చేసేవాళ్లని, "రైళ్లాపితే, రైలు పట్టాలు తొలిగిస్తే వాళ్లకేం వస్తుంది" అని. ఎక్కడో రైలుపట్టాలు తీసేశారట. దాదాపు యాభై అరవై మందిదాకా చనిపోయారు. హైదరాబాదు స్టేషనులో ఆ తాలూకు వివరాలన్నీ వేశారు. ఎర్రటి కాగితంమీద కార్బనుతో రాశారు చచ్చినవాళ్ల పేర్లు. తను ఎంత అదృష్టం చేసుకుని ఉండాలో తన పేరు అందులో ఉండటానికి. పేపరునిండా ఆ ప్రమాదం తాలూకు వార్తలు. అందరిలో దాన్ని గురించే వ్యాఖ్యానాలు.

**జి. మోహనదాసు, రాధాబాయి టెక్స్‌టైల్స్, బొంబాయి.**

పి. కరుణాకర్, ట్రిప్లికేన్, మద్రాసు.

ఆర్. సి. గుప్తా, మైసూరు—1.

అందరి పేర్లు వరసగా చదువుతున్న రావు ఠక్కున ఆగిపోయాడు.

ఎస్. రంగనాథాచారి, ఎమ్. ఎస్‌సి, పూనా—6.

★